పోరాటల గడ్డ కొత్తగూడెం

- తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ప్రముఖపాత్ర


కొత్తగూడెం గ్రామ వ్యూ

తుంగతుర్తి: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తుంగతుర్తి మండల పరిధిలోని కర్విరాల కొత్తగూడెం ప్రముఖపాత్ర పోషించింది. ఈ పోరాటంలో దివంగత నేత భీంరెడ్డి నర్సింహారెడ్డిది కీలకపాత్ర. నాడు పోలీస్‌స్టేషన్ తుంగతుర్తి పట్టణంలో ఉండేది. నిజాం సైన్యంతో పాటు రజాకార్లు ఆచారకాలు చేస్తూ ప్రజలను పీడించేవారు. ఆ సమయంలో భీంరెడ్డి నర్సింహారెడ్డి, ఆయన సోదరి మల్లు స్వరాజ్యం, వెంపటి గ్రామానికి చెందిన దాయం రాజిరెడ్డిలు చుట్టూ ఉన్న గ్రామాల వారితో దళాలను ఏర్పాటు చేసి తుంగతుర్తి పోలీస్‌స్టేషన్‌పై దాడి చేయడానికి వెళ్లారు. ఆ సమయంలో పోలీసులు కాల్పులు జరపడంతో కొత్తగూడెంవాసి మల్లేపాక మైసయ్య అమరుడయ్యాడు. గ్రామంలో మైసయ్య స్మారకార్థం స్థూపం నిర్మిస్తుంటే అది గమనించి రజాకార్లు నాలుగు సార్లు కూల్చివేశారు. అయినా రజాకార్లకు ఎదురొడ్డి మైసయ్య స్మారక స్థూపాన్ని నిర్మించారు.

మారిన ముఖచిత్రం

రజాకార్ల పాలన తర్వాత గ్రామం ముఖచిత్రం మారిపోయింది. భీంరెడ్డి నర్సింహారెడ్డి ఎమ్మెల్యేగా, ఎంపీగా, మల్లు స్వరాజ్యం ఎమ్మెల్యేలుగా పనిచేసి ప్రజలకు సేవలందించారు. నాడు గ్రామంలో 800పైగా జనాభా ఉండేది. ప్రస్తుతం సుమారు 2,600 మందికి పైగా జనాభా ఉన్నారు. కొత్తగూడెం గ్రామ పంచాయతీగా ఏర్పడి అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోంది. గ్రామంలో పంచాయతీ భవనం నిర్మించారు. జెడ్పీ ఉన్నత , ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పడ్డాయి. గ్రామం సమీపం నుంచే 365 నంబర్ జాతీయ రహదారిని నిర్మించారు. గ్రామంలో సీసీరోడ్లు, ఓహెచ్‌ఆర్ ట్యాంకులు నిర్మించారు. గ్రామంలో మిషన్ భగీరథ నీళ్లువస్తున్నాయి.

ఆజాద్ హైదరాబాద్

నిజాం పోలీస్ క్యాంపుగా ఏనుబాముల

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : ఆత్మకూర్ ఎస్ మండలంలోని ఏనుబాముల గ్రామం నిజాం పాలనలో పోలీస్ క్యాంపుగా ఉండేది. సూర్యాపేట నుంచి రావడానికి రోడ్డుకు పక్కనే ఉండడంతో ఏనుబాముల గ్రామాన్ని అప్పట్లో వ్యూహాత్మక రక్షణ కేంద్రంగా ఏర్పాటు చేసుకున్నారు. పోలీసులు ఏనుబాముల పోలీస్ క్యాంప్ నుంచి తమ కార్యకలాపాలను నిర్వహించేవారు. ఈ గ్రామంలో ఉన్న పోలీస్ క్యాంపును ఎత్తివేసేలా చేయాలని భావించి అనేక మార్లు దాడులు చేయడానికి ప్రయత్నించగా సాధ్యపడలేదు. పోలీసులంతా ఒకే చోట భారీగా ఉండడం వారికి చుట్టూ చెరువు కొండలు ఉండడంతో దాడి చేయడానికి యత్నించిన దళాలు విఫలమయ్యాయి. ఏనుబాముల గ్రామానికి సమీప గ్రామాలైన ఆత్మకూర్, పాతసూర్యాపేట, పాతర్లపహాడ్, కోటపహాడ్, ఏపూరు తదితర గ్రామాల్లో కమ్యూనిస్టుల ప్రాభల్యం అధికంగా ఉండడంతో ఆయా గ్రామాల్లో ఏ సంఘటనలు జరిగినా కమ్యూనిస్టు నాయకులను, అనుమానితులను, సానుభూతి పరులను ఏనుబాముల క్యాంపునకు తీసుకెళ్లి చిత్రహింసలకు గురిచేసేవారని చెబుతుంటారు.


ఏనుబాముల గ్రామ వ్యూ

ఇప్పుడు అభివృద్ధి పథంలో..

ఏనుబాముల గ్రామం తర్వాతి కాలంలో దాచారం గ్రామ పంచాయతీ పరిధిలో ఉండేది. ఆ తర్వాత ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పడింది. ఇప్పుడు 1400 పైగా జనాభా ఉంది. గ్రామంలో ఉన్నత పాఠశాల ఏర్పాటైంది. మౌలిక వసతులు సమకూరాయి. అన్ని రాజకీయ పార్టీలు, అన్ని కులాలు, మతాల వారు ఇక్కడ కలిసిమెలసి జీవిస్తున్నారు. ఈ గ్రామం ప్రస్తుతం అభివృద్ధి పథకంలో ఉంది.

క్లుప్తంగా

కిష్టయ్యకు ఎమ్మెల్యే పరామర్శ

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన తెలంగాణ రాష్ట్ర సాధన తొలి, మలిదశ ఉద్యమకారుడు, వినియోగదారుల సంఘం రాష్ట్ర నాయకుడు సుతారపు కిష్టయ్య అనారోగ్యానికి గురి కాగా సోమవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే కిష్టయ్య జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిపల్లి మధుకర్‌రెడ్డి, లక్ష్మమ్మ, పట్నం కమలాకర్–సుజాత దంపతులు, సుతారపు అనిల్, దాసరి సోమయ్య పాల్గొన్నారు.

20న కలెక్టరేట్ ఎదుట ధర్నా

గరిడేపల్లి : కలెక్టరేట్ ఎదుట ఈ నెల 20న బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించబోయే ధర్నాను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ కన్వీనర్ దూళిపాల ధనుంజయనాయుడు కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని, బీసీ ఉద్యోగస్తులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.

అబ్బయ్య మృతి తీరని లోటు


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మకూర్ (ఎస్) : సీపీఎం సీనియర్ నాయకుడు గుండు అబ్బయ్య మృతి పార్టీకి తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని గట్టికల్ గ్రామంలో అబ్బయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు దండా వెంకటరెడ్డి, మండల కార్యదర్శి అవిరి అప్పయ్య, కమిటీ సభ్యులు నాగరాజు, రాచకొండ సైదులు, గుండు లింగయ్య, గుండు రమేష్, గుండు పెదలింగయ్య పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

చివ్వెంల : వట్టిఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మట్టపల్లి నర్సమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందింది. దీంతో ఆమె మృతదేహాన్ని పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, న్యాయవాదులు సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో వై. వెంకటేశ్వర్లు, సీనియర్ న్యాయవాదులు నల్లకుంట్ల అయోధ్య, జటంగి వెంకటేశ్వర్లు, మల్లయ్య ఉన్నారు.

డీజే వాహనం సీజ్

ఆత్మకూర్ (ఎస్) : ఎలాంటి అనుమతులు లేకుండా గణేశుడి శోభాయాత్రలో ఉపయోగించిన డీజే వాహనాన్ని పోలీసులు సోమవారం సీజ్ చేశారు. ఎస్‌ఐ సైదులు గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామోజీ తండాలో జరిగిన గణేశుడి శోభాయాత్రలో మరిపెడ మండలం తానంచర్ల గ్రామం నుంచి టాటా ఏస్ వాహనంలో డీజే బాక్సులను తీసుకొచ్చారు. దీంతో వాహనంతోపాటు డీజే బాక్సులను సీజ్ చేసి, డీజే నిర్వాహకుడు భూక్య నరేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అర్వపల్లి ఆలయంలో పూజలు


పూజలు చేస్తున్న రేఖ దంపతులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీ నర్సింహస్వామి ఆలయాన్ని సోమవారం సినీ సంగీత దర్శకుడు అగస్త్య, జాతీయ టెన్నిస్ క్రీడాకారిణి, రేఖ చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయంలో నీటి సమస్యను తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరిష్కరించనున్నట్లు తెలిపారు.

గంగమ్మ ఒడికి గణనాథుడు


సూర్యాపేటలో భజన మందిరం వినాయకుడి వద్ద పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, దామోదర్ రెడ్డి, తదితరులు


సద్దుల చెరువులో విగ్రహాల నిమజ్జనాన్ని తిలకిస్తున్న భక్తులు


సద్దుల చెరువులో వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు


సద్దుల చెరువు కట్టపై పోలీసుల బందోబస్తు


సూర్యాపేటలో కోలాటం ఆడుతున్న మహిళలు


సూర్యాపేటలో శోభాయాత్రలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సూర్యాపేట : తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణనాథుడు సోమవారం గంగమ్మ ఒడికి చేరాడు. సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో గ్రామ గ్రామన నిమజ్జన వేడుకలు నిర్వహించారు. గణనాథుడి విగ్రహాలకు కోలాటాలు, భజనలతో వైభవంగా శోభాయాత్ర నిర్వహించి ఆయా గ్రామాల్లోని చెరువుల్లో నిమజ్జనం చేశారు.

సూర్యాపేట రూరల్ : 13వ వార్డు గాంధీనగర్‌లో గణేష్ విగ్రహం వద్ద మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. గణేశుడి నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నారు.

మద్దిరాల : కుక్కడంలోని గణేశుడి వద్ద నిర్వహించిన వేలంలో కుంచం వెంకన్న మంగమ్మ దంపతులు రూ.25,116లకు లడ్డూను దక్కించుకున్నారు. మహదేవ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద మద్దెల(గుడిసె) వెంకన్న విజయ దంపతులు రూ.22వేలకు, మద్దిరాలలో వల్లపు రమేష్ రూ. 8,116లకు లడ్డూను వేలంలో దక్కించుకున్నారు.

తిరుమలగిరి : స్థానిక క్రాస్ రోడ్డులోని వినాయక మండపం వద్ద లడ్డూ వేలం నిర్వహించగా సాయి శృతి రూ.60,116లకు దక్కించుకున్నారు.

నూతనకల్ : మండల కేంద్రంలోని మొగుళ్ల బజార్‌లో వినాయకుడి లడ్డూను గ్రామానికి చెందిన గుండ్ల శివ రూ. 54,116లకు వేలంలో దక్కించుకున్నాడు.

నాగారం : మండల పరిధిలోని పస్తాల గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద సోమవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగారంబంగ్లాలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య వినాయకుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం ప్రారంభించారు.


సూర్యాపేట రూరల్ : గాంధీనగర్‌లో పూజలో పాల్గొన్న జగదీష్‌రెడ్డి


సూర్యాపేట టౌన్ : జీఆర్ వివేకావాణి పాఠశాల ఆధ్వర్యంలో..


సూర్యాపేట టౌన్: ప్రతిభ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో..


సూర్యాపేటలో శ్రీలక్ష్మి వెంకటసాయి ఒకేషనల్ కాలేజీ ఆధ్వర్యంలో..


సూర్యాపేట టౌన్: శ్రీమేధా కళాశాల ఆధ్వర్యంలో..


ఆత్మకూరులో..


తిరుమలగిరిలో..


పెన్‌పహాడ్ : చెట్లముకుందాపురంలో..


నూతనకల్‌లో..


నాగారం : పస్తాలలో పూజలు చేస్తున్న సామేల్


చివ్వెంలలో శోభాయాత్ర..


తుంగతుర్తిలో..


అర్వపల్లి : తిమ్మాపురంలో..

నిమజ్జనాన్ని పరిశీలించిన ఎస్పీ

సూర్యాపేట టౌన్ : జిల్లా కేంద్రంలో సద్దుల చెరువు మినీ ట్యాంక్ బండ్ వద్ద గణేశుడి విగ్రహాల నిమజ్జనాన్ని సోమవారం రాత్రి ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా పర్యవేక్షణ చేయాలని అధికారులకు సూచించారు. భక్తులు, ఉత్సవ కమిటీలు శోభాయాత్ర సమయంలో, నిమజ్జనం సమయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఆయన వెంట అదనపు ఎస్పీ జనార్దన్ రెడ్డి, డీఎస్పీ రవి, మున్సిపల్ కమిషనర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వీర రాఘవులు, సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, పోలీసులు, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

పస్తాల-వెలిశాల రోడ్డు మరమ్మతు చేపట్టాలి

నాగారం : పస్తాల నుంచి వెలిశాల ఎక్స్‌రోడ్డు వరకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి కడియం కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పస్తాల ఎక్స్‌రోడ్డు నుంచి వెలిశాలకు వెళ్లే బీటీరోడ్డు పూర్తిగా దెబ్బతిని కంకరతేలిందన్నారు. గుంతల రోడ్డుపై రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పస్తాల శివారులో కల్వర్టు వద్ద వర్షాలు వచ్చిన ప్రతిసారి వరద ప్రవాహంతో రాకపోకలు నిలిచిపోతాయని, కల్వర్టు వద్ద బ్రిడ్జిని నిర్మించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు గుడపూడి వెంకటేశ్వర్లు, మొల్కపురి మహేందర్, కండె భిక్షం, సత్తయ్య, అంజయ్య, పద్మ, స్వరూప, యాదమ్మ, నాగయ్య, సైదులు పాల్గొన్నారు.

పంచలోహ కిరీటాల ఊరేగింపు


పంచలోహ కిరీటాలను ఊరేగిస్తున్న ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కోడూరు గ్రామంలో సీతారామాంజనేయ స్వామి ఆలయానికి హైదరాబాద్ నుంచి తెచ్చిన సీతమ్మ, రామ లక్ష్మణులు, ఆంజనేయస్వామి పంచలోహ కిరీటాలను సోమవారం గ్రామంలో కోలాటాలు, భజనలతో ఊరేగించారు. ఈ విగ్రహాలను సొంతంగా ఆలయానికి బహూకరిస్తున్నట్లు దేవాలయ చైర్మన్ చెంచల సోమనాథం–నాగలక్ష్మి దంపతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెంచల రుక్మయ్య, లక్ష్మమ్మ, లింగాల సోమయ్య, గుండెపురి సోమయ్య, నారాయణ, భిక్షమమ్మ, ఉప్పలయ్య, రాములు, మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా ముత్యాలమ్మ బోనాలు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణంలో ముత్యాలమ్మ జాతర కనుల పండువగా కొనసాగుతోంది. మూడు గుళ్లలో ఉన్న ముత్యాలమ్మ, అంకమ్మ అమ్మవార్లను సోమవారం పూజారులు పట్టువస్త్రాలు, పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలతో పెద్ద ఎత్తున వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పట్టణవాసులు మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లలను అందంగా అలంకరించి పురవీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

వార్డులో లేని ఓటర్లను తొలగించాలని వినతి


జాజిరెడ్డిగూడెం పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న 1వ వార్డు ఓటర్లు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని 1వ వార్డులో సుమారు 80 మంది ఓటర్లు గత 20 ఏళ్ల నుంచి జాతీయ రహదారి పక్కన ఉన్న సబ్ మార్కెట్ యార్డు సమీపంలో ఇళ్లు నిర్మించుకొని అక్కడే స్థిరపడి ఉంటున్నందున ఆ ఓటర్లను తమ వార్డు నుంచి తొలగించాలని కోరుతూ సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో పలువురు సోమవారం పంచాయతీ కార్యదర్శి నెహ్రూనాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఇప్పటికే ఈ విషయమై మండల అధికారులకు కూడా వినతి పత్రాలు ఇచ్చినట్లు చెప్పారు. ఓటరు జాబితా సవరణ జరుగుతున్నందున వెంటనే 1వ వార్డులో ఉండని ఓటర్ల పేర్లను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చెనబోయిన వీరయ్య, కొమ్ము విజయ్, శిగ వెంకన్న, రవికుమార్, శ్రీను, రవి, శ్రీకాంత్, వినయ్, శిగ రవి, శేఖర్, శ్రవణ్, మహేష్, విజయ్, నర్సింగ మహేష్, ఆకుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలకు నీరందించాలి

హుజూర్‌నగర్‌రూరల్ : ఎండిపోతున్న పంట పొలాలకు నీళ్లు వదిలి రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మండలంలోని అమరవరంలో ఎండిపోయిన పంట పొలాలను సోమవారం రైతులతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. అకాల వర్షాలకు కాల్వ కట్టలు, చెరువులు, కుంటలు తెగి 15 రోజులు అవుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆయన వెంట రైతులు మాదూరి నర్సింహాచారి, పారుపల్లి శ్రీనివాస్, అనిమిరెడ్డి, సైదిరెడ్డి, ఖాసిం, కృష్ణమూర్తి, గోపాలరావు, సీతారాములు ఉన్నారు.

సాయుధ పోరాట వీరుల వారసత్వాన్ని కొనసాగించాలి


మద్దిరాల : గోరెంట్లలో సాయుధ పోరాట వారోత్సవాల్లో పాల్గొన్న నాయకులు


పెన్‌పహాడ్ : అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన..

మద్దిరాల : తెలంగాణ సాయుధ పోరాట వీరల వారసత్వాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట గోపి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సోమవారం గోరెంట్ల గ్రామంలో అమరువీరులకు నివాళులర్పించారు. సాయుధ పోరాట యోధులు దీకొండ వెంకన్న, బానోత్ లచ్చిరాం నాయక్, శిరంశెట్టి సోమయ్య, దీకొండ లింగయ్య చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. భూస్వాములకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేసి భూములను పేదలకు పంచిన ఘనత ఎర్రజెండాకే దక్కిందని అన్నారు. అనంతరం మద్దిరాలలో సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కందాల శంకర్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి కల్లెపల్లి భాస్కర్, దీకొండ రంగయ్య, పోలోజు సైదులు, కన్న వీరన్న, పులుసు లింగయ్య, టిక్యా పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను బీజేపీ వక్రీకరిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా ఆదివారం రాత్రి భక్తాళాపురం గ్రామంలో అమరవీరుల స్థూపాల వద్ద కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చింతం వెంకటేశ్వర్లు, సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి నెమ్మాది వీరయ్య, అడివయ్య, ఇరుగు రమేష్, గోపాల్‌దాసు సైదులు, నలపు రామ్మూర్తి, జుట్టుకొండ గణేష్, చింతం ఉపేంద్ర, నీలాల సతీష్, కిరణ్, జాని, నాగరాజు, పవన్, రమేష్, సందీప్, పద్మ, రవి, సూరి, సోమయ్య, సతీష్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.